ఇంటి చుట్టూ చీకటి...గాఢాంధకారం....కీచురాళ్ళ రొద...నిట్టూర్చింది శాంత. ఇక్కడ కూడా...ఈ పట్నంలో కూడా కీచురాళ్ళ రొద తప్పలేదు తనకి....పిచ్చి ఆలోచనకి జీవంలేని నవ్వొకటి వెలిసింది పెదవులమీద... వాటికి పల్లె ఏమిటి? పట్నం ఏమిటి? ఆ తేడా వాటికేం ఉంది? అన్యాయానికి పల్లె, పట్నం తేడా లేనట్టే...అంతకంతకీ కీచురాళ్ళ రొద ఎక్కువై, భయంతో, మోకాళ్ళ చుట్టూ చుట్టి ఉన్న చేతుల్ని మరింత గట్టిగా బిగించి, గోడ ఓరగా ఒదిగి కూర్చుంది...కళ్ళు ఆగకుండా కన్నీటిని కురిపిస్తూనే ఉన్నాయి....

పక్కనే పిడుగుపడినా తెలియకుండా ఉండేంత మత్తుగా తాగి, ఒళ్ళు మరిచి మంచమ్మీద అడ్డంగా పడి నిద్రపోతున్న భర్త వంకే తదేకంగా చూసింది. కన్నీటి తెరల్లో అతని అందం మసకబారిపోయింది. అతనిలోని అనాకారి మనసే తనకిప్పుడు కనిపిస్తోంది. ఔను...తన కన్నీరు, పై పై మెరుగుల్లాంటి, పై పై మేకప్పుల్లాంటి అతని అందాన్ని కడిగేసింది. ఇప్పుడు అతని అనాకారితనం బట్టబయలైంది.

ఎంత సంతోషంగా, ఎన్ని మధురభావాలతో, జంటగా అతనితో కల్సి ఈ ఊళ్ళో ఈ ఇంట్లో అడుగుపెట్టింది తను. కానీ జరగబోతున్నదేమిటి? తల్చుకుంటేనే శాంత గుండె దడ దడ లాడింది. ఎంత మోస పోయింది తను? భగవంతుడా ఏది దారి? నేనేం చెయ్యాలిప్పుడు?

సవతితల్లి పోరులో చిన్నతనంనించి శాంత సుఖపడిందెప్పుడూ లేదు. తిట్లు, దెబ్బలు తినడం తప్ప. తెల్లారి లేచింది మొదలు, రాత్రి పొద్దుపోయే వరకూ అన్ని పనులూ శాంతచేత చేయిస్తూ కూడా, కారణం లేకుండా బాదేస్తూ, ఏవేవో తిడుతూ సణుగుతూ ఎప్పుడూ కీచురాయిలా రొద పెడుతూనే ఉండేది కమలమ్మ. రాత్రిళ్ళు లైట్లన్ని ఆర్పేసి, ఇంట్లో అందరూ పడుకున్నప్పుడు ఆ చీకట్లో, ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వచ్చే కీచురాళ్ళ రొద భయంకరంగా తోచేది శాంతకి. రాత్రిళ్ళు ఈ రొద, పగలు సవతితల్లి రొద. తండ్రి పోయినప్పటినించీ, పక్క ఊర్నించి పిన్నికి దూరపు చుట్టం, వరసకి ఆవిడకి అన్నగారయ్యే కుటుంబరావుగారు పదిరోజులకోసారి వస్తూ ఉండడం, వొచ్చినప్పుడల్లా ఆయనా, పిన్నీ రహస్యంగా గంటల తరబడి మాట్లాడుకుంటూ ఉండడం గమనిస్తూనే ఉంది శాంత. మూడు, నాలుగు నెలల తర్వాత ఒకరోజు కమలమ్మ ఎంతో ప్రేమగా పిలిచింది శాంతని.

"ఇదుగో శాంతా! ఈ పూలు పెట్టుకుని, ఈ చీర కట్టుకోమ్మా" అప్పుడే జడవేసుకుని, మొహం కడుక్కొచ్చి బొట్టు పెట్టుకుంటున్న శాంత వెనక్కి తిరిగి చూసింది. పిన్ని ఇంటో అడుగుపెట్టిన ఇన్నేళ్ళల్లో ఇంత మృదువుగా కాదుకదా ఇందులో వందో వంతు మృదువుగా కూడా పిలవలేదు తననెప్పుడూ అని అసలే ఆశ్చర్యపోతుంటే, పిన్ని చేతిలో చీర మరింత పెంచింది ఆశ్చర్యాన్ని. తను కట్టగా వెల్సిపోయి, చిరిగిపోయిన చీరలే చింపి వోణీలుగా వేసుకోమని ఇస్తోంది ఇన్నాళ్ళూ. అలాంటిది పిన్నికున్న చీరల్లో అందమైన, ఖరీదైన చీర అందులోనూ ఒకరోజు, ఎంత బాగుందో ఈ చీర అని తన చేతుల్లోకి తీసుకుని చూస్తుంటే, ఇలాంటి చీరలు ముట్టుకునే అర్హత కూడా నీకు లేదన్నట్టు మాట్లాడింది విసురుగా చీర లాగేసుకుని. అదే చీర ఆ చీర ఇప్పుడు తనని కట్టుకోమని స్వయంగా అడుగుతోంది. నమ్మలేనట్టు చూస్తూ నిలబడిపోయిన శాంత చేయిలాగి చీర ఉంచింది. "కుందనపు బొమ్మవి. ఈ చీరలో ఇంకా మెరిసిపోతావు".

"ఇప్పుడు నాకెందుకు పిన్నీ ఈ చీర?"

"ఎందుకో ఏవిటే అవన్నీ తర్వాత. ముందు మీ పిన్ని చెప్పినట్టు చెయ్యి".

కరుకుగా పలికింది కుటుంబరావుగారి గొంతు.

చిన్నబుచ్చుకున్న మొహంతో, నొచ్చుకున్న మనసుతో లోపలికి వెళ్ళి పిన్ని ఇచ్చిన చీర కట్టుకుని, పూలు పెట్టుకుని గదిలోంచి ఇవతలికి రాబోయింది.

"అహహ...కాసేపిక్కడే కూచో, నేను పిల్చినప్పుడు ఇవతలకి వొద్దువుగాని ఇదుగో అన్నయ్యా ఇలా వొచ్చి చూడు. అప్పుడే పెళ్ళికూతురి కళ వొచ్చేసింది మా పుత్తడి బొమ్మకి." అన్నగార్ని కేకేసింది కమలమ్మ.

తను చాలా అందగత్తె. ఆ మాట మాటికి నూరుపాళ్ళూ నిజం. కానీ ఆ మాట పిన్ని ఒప్పుకోవడమే వింతల్లో వింత. తన సంతానం నలుగురూ అనాకారులు, సవతికూతురు అందగత్తె అవడంతో ఈర్ష్య, కోపాల్తో కమలమ్మ నిద్దట్లో కూడా శాంతని దేబిమొహమా, కోతిమొహమా, కొండముచ్చుమొహమా వగైరా నామాల్తోనే పిలుస్తుంది. ఇప్పుడు పిన్ని నోటి వెంట కుందనపు బొమ్మ, పుత్తడి బొమ్మలాంటి పేర్లు వింటుంటే ఈ పిన్ని తన పిన్నేనా అన్న అనుమానం, ఆశ్చర్యం కలిగాయి శాంతలో.

"ఈ పెళ్ళిచూపులు ఏదో పేరుకేగానీ, ఆ వొచ్చేవారు నిన్నిలా చూడగానే అలా ఎగరేసుకుపోడం ఖాయం" అదోలా నవ్వింది కమలమ్మ. శాంతకేదో భయం అనిపించింది. తనకి పెళ్ళా? పెళ్ళంటే మాటలా? డబ్బు కావద్దూ?


"అబ్బాయి నవమన్మధుడిలా ఉంటాడు. సినిమా హీరోలు ఈ అబ్బాయి కాలిగోటికి సరితూగరనుకో. రెండుచేతులా సంపాదిస్తున్నాడు. పిల్లజమీందారు. అతనిమీద ఆధారపడ్డవాళ్ళులేరు. ఒంటరి పక్షి. అంతా మనమ్మాయి అదృష్టం" దండకంలా చదువుకుపోతున్నారు కుటుంబరావుగారు.

అప్పో సప్పోచేసి తన పెళ్ళి చేస్తుందా పిన్ని? అయితేమటుకు అప్పెలా తీరుస్తుంది? తను పెళ్ళిచేసుకుని వెళ్ళిపోతే పిన్ని ఒక్కత్తే ఈ పిల్లల్ని పెట్టుకుని-అయ్యో! తల్చుకుంటేనే గుండె చెరువవుతోంది. 'వొద్దు పిన్నీ నాకు పెళ్ళొద్దు'. శాంత మనసు బాధగా మూలిగింది.

"అదిగో అబ్బాయొచ్చేశాడు" కుటుంబరావుగారి మాటతో ఉలిక్కిపడి ఆలోచనల వలయంనించి బయటపడింది.

పెళ్ళిచూపుల తతంగం ముగిసింది. సిగ్గు బరువుతో, చూపులు నేలనంటుకుపోగా గదిలో కొచ్చిపడింది శాంత.

కుటుంబరావుగారి మాటల్లో అతిశయోక్తి కనిపించలేదు శాంతకి. కట్నం తీసుకోడుట. తను అతనికి నచ్చిందిట. నిజంగా అతను తన పాలిటి దేవుడే, ఇన్నేళ్ళుగా తనని ఎంత హీనంగా చూసినా, ఆడదానికి జీవితంలో కావల్సిన అతి ముఖ్యమైన విషయంపట్ల అదే అదే పెళ్ళి అనే నూరేళ్ళపంట విషయంలో పిన్ని తన పట్ల ఎంత శ్రద్ధ, దయ చూపించింది. పిన్ని తనపట్ల దేవతగా మారిపోయింది. ఏదో, రెండో పెళ్ళి వాడికో, కాటికి కాళ్ళు చాచుకున్న వాడికో ఇచ్చి కట్టబెట్టకుండా ఇంత మంచి సంబంధం వాళ్ళ అన్నగారి ద్వారా చూసి చేస్తోంది. ఈ సమయంలో తన తండ్రే ఉంటే ఎంత సంతోషించేవాడో?



# కీచురాళ్ళు

— తమిరిశ జానకి

గుళ్ళో పెళ్ళి నిరాడంబరంగా జరిగిపోయింది. ఎంత ముక్తసరిగా అంటే తన మెళ్ళో అతను...చిరంజీవి పసుపుకొమ్ము కట్టాడు. అంతే అదే పెళ్ళి. అందుకు సాక్షులు పిన్ని, కుటుంబరావుగారూ, ఆ భగవంతుడి విగ్రహం అంతే. అతను డబ్బున్నవాడనే అన్నారు. మరి మంగళసూత్రమైనా ఛ....ఛ...అలాంటి ఆలోచన్లు అనవసరం. పవిత్రమైన పసుపుకొమ్ము చాలు. మనిషి ముఖ్యం. మనసు ముఖ్యం. మంగళసూత్రం కాదు. మంచి మనసుతో కట్నంగానీ, మరో విధంగాగానీ డబ్బు ఆశించకుండా తనని భార్యగా స్వీకరించాడు. ఇంతకంటే తనకేం కావాలి? తనకి తనే నచ్చ చెప్పుకుంది శాంత.

పుట్టినప్పటినించీ ఉన్న ఊరు కదిలి ఎరుగని శాంత, భర్తతో కల్సి పెద్ద పట్నంలో, భర్త ఇంట్లో అడుగుపెట్టింది. ఎన్నో ఆశలతో మరెన్నో మధురోహలతో.

వంటింట్లోకి కావల్సిన సరుకులన్నీ రిక్షాలో తీసుకొచ్చి పడేశాడు చిరంజీవి. ఆ పూటకి హెూటల్నించి క్యారియర్ తీసుకొచ్చేశాడు. అతని కౌగిట్లో గువ్వలా ఒదిగిపోయింది శాంత. కాలమే తెలియలేదు అతని సన్నిధిలో వీధితలుపు దబదబా చప్పుడవడంతో ఈ లోకంలోకి రాక తప్పలేదు. చిరంజీవి తలుపు తీసీ తియ్యడంతో తుఫానులా వొచ్చి పడ్డారు అయిదారుగురు అమ్మాయిలు. "హాయ్" అంటూ వాళ్ళు తన భర్తమీద పడిపోతూ మాట్లాడుతుంటే శాంత కళ్ళు మరింత పెద్దవయ్యాయి. ఆ అమ్మాయిల మాటతీరూ, కట్టుకున్న బట్టలు చూస్తూ సిగ్గుతో శాంత తలదించుకుంది.

"జీవీ పద బయల్దేరు" వాళ్ళల్లో ఒకమ్మాయి చిరంజీవి చెయ్యి పట్టుకుని లాగింది.

"ఎక్కడికి?"

"నళిని మంచి పార్టీ ఇస్తోంది. నిన్ను తీసుకురమ్మని మమ్మల్ని పంపింది".

"నిజం...నిజంగానా? నళిని పిలవడం మనం రాకపోవడమూనా? పదండి. మీరు ముందు పదండి. నేను ఐదు నిమిషాల్లో బయల్దేరి వొస్తున్నాను".

"నళిని నిన్ను ప్రేమిస్తోంది తెల్సా? నీ పాటంటే పడిచస్తుంది. నీ మాటలు తనని మత్తులో ముంచెత్తుతాయిట. నువ్వు ఇమ్మంటే తన ప్రాణమైనా ఇస్తుందిట. అంత మనస్ఫూర్తిగా నిన్ను ఆరాధిస్తోందిట" కిలకిలా నవ్వుతూ చెప్పిందామ్మాయి.

కాళ్ళకింద భూమి కదిలిపోతున్నట్టయింది శాంతకి.

ఏమిటిది? తనేం వింటోంది? తన చెవులు తనని మోసం చెయ్యట్లేదుకదా? వీళ్ళందరూ ఎవరూ?

"తలుపేసుకో శాంతా. నేనొచ్చేటప్పటికి బాగా పొద్దుపోతుంది. నా కోసం వంట చెయ్యకు" ఇస్త్రీ బట్టలు కట్టుకుని, పూలరంగడిలా తయారై వెళ్ళిపోయాడు చిరంజీవి.

కొత్త పెళ్ళికూతురి కళ్ళల్లో కాంతులు కాదు కన్నీళ్ళు చిందాయి. వీధితలుపు గడియ వేసొచ్చి మంచంమీద చతికిలపడింది.

దుఃఖం గొంతులో సుళ్ళు తిరుగుతోంది. తన తియ్యని కల ఇలా చెదిరిపోయిందేమిటి? తన భర్త నిజ స్వరూపం ఇదా? కళ్ళెదురుగా చూసి కూడా నమ్మనంటుందే ఈ మనసు. ఆ అమ్మాయిలంతా ఎవరు? వాళ్ళకి, తన భర్తకీ ఏవిటి సంబంధం? ఆ నళిని ఎవరు? అర్థంకాని ప్రశ్నలు...ఏదో భయం మనసులో లతలా అల్లుకుపోతోంది.

ఎప్పుడు చీకటిపడిపోయిందో ఆలోచనల్లో గమనించనే లేదు. లేచి లైటు వేసింది. గదంతా వెలుగు. కానీ మనసులో అలుముకున్న చీకటి అలాగే ఉంది. కొత్త ఊరు, కొత్త చోట ఒంటరిగా దిగులుగా భయం భయంగా తన భయాన్ని రెట్టింపు చేస్తూ ఇంటివెనకనించి నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ కీచురాళ్ళ రొద అలా ఎంతసేపో ఏడుస్తూ కూర్చునే ఉన్న శాంత అర్ధరాత్రి భర్త పిలుపుతో, కదిలే బొమ్మలా, ప్రాణంలేని కట్టెలా లేచి తలుపు తీసింది. తూలిపడి పోతున్న భర్తని అప్రయత్నంగా పట్టుకుని మంచం దగ్గిరికి నడిపించింది. నిన్నటి తన భర్తకీ ఈ రోజు ఈ మనిషికీ ఎంత తేడా? తప్పు తప్పు. తను భారత స్త్రీ. భర్త గురించి చులకనగా ఆలోచించను కూడా ఆలోచించకూడదు. ఇతను తన భర్త, తన దైవం

వె[్రిగా నవ్వుకుంది లోలోపల.

''ఇట్రా'' చెయ్యి ఊపుతూ మత్తుగా పిలిచాడు. మెల్లిగా నడిచింది ముందుకి.

''మంచి బేరం సెటిల్ చేశాను. రేపటినించీ రోజూ కావల్సినన్ని పెద్ద బేరాలు....వందలు వందలు, వేలు వేలు రేపటినించీ నా ఇంట్లో నా శాంత కనకవర్షం కురిపిస్తుంది. ఔను కదూ!''

''ఏమిటండీ మీరు మాట్లాడేది? నాకేం అర్థంకావట్లేదు''.

''ఇందులో అర్థంకాకపోవడానికేముంది? డబ్బు....డబ్బు నీకు మాత్రం చేదా? రేపటినించీ నువ్వు రాణీలా బతకచ్చు. నేను రాజాలా బతకచ్చు. మన స్వంత బిజినెస్ మొదలుపెట్టబోతున్నాం రేపట్నించీ మనిద్దరం. రేపు రాత్రి రాబోతున్నాడొక పెద్ద బిజినెస్‌మాన్ మనింటికి. నీలాంటి సంసార పక్షం చిన్నది కావాలిట. ఎడ్వాన్స్ ఇచ్చేశాడు ఇవాళ. తక్కినది రేపు రాత్రి నీ చేతికిస్తాడు''.

నెత్తిన పిడుగుపడినట్టయింది శాంతకి.

''ఏమండీ ఏమిటి మీరు మాట్లాడేది. తాగిన మైకంలో మీరేం మాట్లాడుతున్నారో మీకు తెలుస్తోందా అసలు?'' గట్టిగా రెండు చేతుల్తో భర్తని కుదిపింది.

''నోరుముయ్'' పెద్దగా గద్దిస్తూ లేచి కూర్చున్నాడు చిరంజీవి.

''నేనేం మాట్లాడుతున్నానో నాకు తెలియకపోవడం ఏమిటి? నేను చెప్పినట్టు నడుచుకుని తీరాలి నువ్వు...రెండువేలిచ్చి మీ పిన్ని దగ్గర కొనుక్కొన్నాను నిన్ను''.

తెల్లబోయి చిత్తరువులా నిలబడింది శాంత.

''నీ అందం చూసి మోహించి పెళ్ళాడా ననుకున్నావా? పెళ్ళికీ, నాకూ పడదు. నీ కంటే అందమైన వాళ్ళనే ఇలా అనుభవించి అలా వొదిలేశాను. అది నా తత్వం....ఎదురు రెండువేలిచ్చి నీ మెళ్ళో పసుపు కొమ్ము ఎందుకు కట్టానో తెల్సా? కట్టకపోతే కుక్కలా నువ్వు నా వెంట రావుగా? ఆ రెండువేలూ ఆశ చూపించకపోతే నిన్ను నా కమ్మదుగా మీ పిన్ని? మీ పిన్నికీ నాకూ బేరం కుదిర్చి పెట్టిందెవరు? మీ కుటుంబరావు. ఆయనకి నేనెలాంటివాడినో బాగానే తెల్సు. నా గురించి అన్నీ మీ పిన్నికి చెప్పారు. ఆవిడకి నువ్వా ఇంట్లోంచి పోతే, నీ భారం ఆవిడకి తగ్గితే అంతే చాలు." పగలబడి నవ్వుతూ చెప్పడం ముగించాడు చిరంజీవి.

అతను చెప్పిన ఒక్కొక్క మాటా ఒక్కొక్క శూలమై శాంత హృదయాన్ని తూట్లు పొడిచింది.

''రేపటినించీ నువ్వు నాకొక డబ్బు సంపాదించి పెట్టే యంత్రానివి. మర్చిపోకు...నాలుగు రోజుల్లో నేను పెట్టిన పెట్టుబడి నా చేతుల్లో పోసెయ్యాలి నువ్వు. ఆ తర్వాత అంతా లాభమే. వందలకి వందలు, వేలకి వేలు లాభాలు...." తూలుతూ లేచి వెళ్ళి మంచమ్మీద అడ్డంగా పడిపోయాడు చిరంజీవి.

దుఃఖాన్ని దిగమింగి తీవ్రంగా ఆలోచిస్తోంది శాంత.

ఇప్పుడేం చెయ్యాలి? తెల్లారితే తన బతుకు బండలు కాబోతోంది. తిరిగి పిన్ని దగ్గరకి వెళ్ళినా మళ్ళీ ఇతనికే తనని అప్పచెప్పేస్తుంది. ఇంటికి పారిపోయే ఆశే లేదు. పోనీ పోలీసు స్టేషన్‌కి వెళ్ళి వాళ్ళతో తన మొర చెప్పుకుని రక్షించమని వేడుకుంటే! వాళ్ళు తనని రక్షిస్తారన్న భరోసా లేదు. కంచే చేను మేసే సామెతగా, రక్షించమని పోలీసుల దగ్గరకి వెళ్ళిన అబలల్ని, అనాథల్ని ఆ పోలీసులే భక్షించిన కథలు వాళ్ళూ వీళ్ళూ చెప్పుకోగా ఎన్నో వింది తను. ఏ పోలీసు మంచివాడో, ఏ పోలీసు చెడ్డవాడో తనకెలా తెలుస్తుంది? లాభంలేదు. ఇక్కడుంటే తనొక జీవచ్ఛవంలా బ్రతకాలి. ఇక్కడినించి పారిపోవాలి. ఎక్కడికో పారిపోవాలి. కానీ ఎక్కడికి? ఎలా? కీచురాళ్ళు రొదకే భయంతో గుండెలదిరిపోయే తను ఈ అర్ధరాత్రి ఎక్కడికి వెళ్ళగలదు? కొంచెం తెలతెలవారుతుండగా ఇంట్లోంచి పారిపోవాలి. కానీ, తన వెంటపడి మళ్ళీ లాక్కురాడూ ఇతను. తన గోడు ఎవరుమటుకు వినిపించుకుంటారు? తన భార్య అని చెప్తాడు. కావాలంటే కుటుంబరావుగార్నీ, పిన్నినీ సాక్ష్యం కూడా తీసుకొస్తాడు. అప్పుడింక తన మాటలీ లోకం వినిపించుకుంటుందా? అలా అని ఇతని చేతిలో ఆటబొమ్మలా, ఇతని ఇంట డబ్బు కురిపించే యంత్రంలా, ఒక జీవచ్ఛవంలా బ్రతకడం ఎంత దుర్భరం. వీల్లేదు. ఏమైనా సరే పారిపోవాలి. ఇతనికి మెలకువ రాక ముందే, పూర్తిగా తెల్లవారకముందే పెరటి వైపు సందులోంచి పారిపోవాలి. ముందు ఈ ఇంట్లోంచి బైటపడాలి. ఆ తర్వాత సంగతి ఇప్పుడాలోచించి బుర్ర బద్దలుకొట్టుకుని లాభం లేదు. ఒక స్థిర నిశ్చయానికొచ్చింది శాంత. కొద్ది కొద్దిగా వెలుగు రేఖలు వచ్చీరానట్లున్న ఆ సమయంలో, చిరంజీవి చొక్కా జేబులోంచి అందిన నోట్లు తీసుకుని రుమాల్లో చుట్టుకుని, తన బట్టల సంచీ ఒక చేత పట్టుకుని పెరటి తలుపు తీసింది. అంతే! ఎపుడు మెలకువ వచ్చిందో, మెరుపల్లే దూకాడు చిరంజీవి.

''పారిపోదామనుకుంటున్నావుటే. నిన్నేం చేస్తానో చూడు'' ఒక్క క్షణం మతి తోచనిదానిలా చూసింది శాంత. మరుక్షణం మూలనున్న పచ్చడి బండని చూశాయి కళ్ళు. తప్పదు. ఇతని బారినించి తనని తను రక్షించుకోక తప్పదు. శాంత చేయి అందుకుని లాగేందుకు ఒక్క పరుగున మీదకి వొచ్చాడు. ఆవేశంతో శాంత చేతిలో బండ అతని తల మీద విచ్చలవిడిగా వీరవిహారం చేసింది. అతనికి ప్రాణమే పోయిందో, స్పృహ మాత్రమే పోయిందో పరీక్షిస్తూ కూర్చునే స్థితిలో లేదు శాంత. వెనక వైపు సందులోంచి మెయిన్ రోడ్డు మీదకొచ్చింది. రైల్వే స్టేషన్ కనుక్కోడం కష్టం అవలేదు. కానీ ఎక్కడకి వెళ్ళాలి? ఎక్కడికని టిక్కెట్టు కొనాలి? ప్లాట్‌ఫారమ్మీద అడుగు పెట్టాక ఈ ప్రశ్న ఇంతింతై కొండంతైంది. ఆలోచిస్తూ నిలబడింది. ''మన రైలు ఇంకో పది నిమిషాల్లో బైల్దేరుతుందిట. త్వరగావెళ్ళి మంచినీళ్ళు నింపుకొస్తానుండు'' ఆయనెవరో తన భార్యతో చెప్తుంటే దగ్గరికి వెళ్ళి మెల్లిగా అడిగింది.

''ఈ రైలేనాండీ ఇంకో పది నిమిషాల్లో బైల్దేరేది?''

''ఔను''

''ఏ ఊరెళ్తుందండీ ఇది?''

ఏ కళనున్నాడో ఓపిగ్గానే సమాధానం చెప్పాడాయన విసుక్కోకుండా. గబగబా వెళ్ళి ఆయన చెప్పిన ఊరికే ఆ రైలుకే టిక్కెట్టు కొని వొచ్చి ఎక్కి కూర్చుంది. ఆ దంపతులు కూర్చున్న కంపార్టుమెంటులోనే...వాళ్ళు దిగిన స్టేషన్లోనే తనూ దిగడం....ఆ ఊళ్ళో అనాథ శరణాలయం ఏదైనా ఉండకపోతుందా? వాకబుచేసి, అనాథ శరణాలయానికి వెళ్ళి పోయి అనాథగా వాళ్ళ ఆశ్రయం కోరడమే. ఈ ఆలోచనతో శాంత మనసు కాస్త నెమ్మదించింది. దిగవల్సిన స్టేషన్ వొచ్చేటప్పటికి


31

# కేమ్లిన్
## స్టేషనరీ

1931–81

ఈ కాంతిమయ
**స్వర్ణజయంతి**
**సందర్భంలో . . .**
సాంస్కృతిక, సాహిత్య,
విద్యా రంగాలలో ప్రజల ఆశయాల
పరిపూర్ణతకు మేము మా ప్రయత్నాలను
పునరాంకితం చేస్తున్నాము.

స్పెషల్ ఇంక్
డూప్లికేటింగ్ ఇంక్
గమ్ & పేస్ట్

పెన్స్ & బాల్ పెన్స్
పెన్స్ & బాల్ పెన్స్
ప్రెజెంటేషన్ సెట్స్ బాల్ పెన్
రీఫిల్స్.హాలో మౌంటింగ్
పేస్ట్. అడెసివ్.

స్టాంప్ ప్యాడ్ & ఇంక్
పెన్స్ & బాల్ పెన్లు.
డెస్క్ స్టాండ్స్.
స్టేప్లర్ & స్కేల్స్
పెంసిల్ ఎరేజర్స్.

మరి
ఇంకెన్నో
టైప్రైటర్ కరెక్టింగ్
ఫ్లూయిడ్.
మార్కింగ్ ఇంక్.
డింక్స్ ఇంక్.

కేమ్లిన్ ప్రైవేట్ లిమిటెడ్
స్టేషనరీ డివిజన్ బొంబాయి-400 059.

camlin 50 GOLDEN JUBILEE

S 81/1 Tel


సాయంత్రమైపోయింది. భయం భయంగా రైలు దిగింది. తనతోపాటూ రైలు దిగిన ఆ దంపతులు చిటికెలో జనంలో కల్సిపోయారు. మళ్ళీ కనవడలేదు. స్టేషన్ బయటికొచ్చింది. ఎవరినడగాలి? ఓ వక్కగా నిలబడి వచ్చేపోయే జనాన్ని చూస్తోంది. అందులో ఒకాయన్ని చూస్తూనే ఈయన చదువుకున్న, పెద్దమనిషిలా ఉన్నారు. ఈయన్ని అడిగితే ఏం అనిపించింది. అయన కుడిచేతి చూపుడు వేలు పట్టుకుని నడుస్తున్నారో అయిదారేళ్ళ పిల్లాడు. ఈయన్ని అడిగితే ప్రమాదమేం ఉండబోదన్న భావం కలిగి అడుగు ముందుకేసింది కాంత.

"బాబుగారూ! ఈ ఊళ్ళో ఆనాథ శరణాలయమేమైనా ఉందా? ఉంటే ఎలా వెళ్ళాలో దారి చెప్తారా కొంచెం" కాంత కళ్ళల్లోకి సూటిగా చూశారాయన. "ఏ ఊరమ్మా మీది"

తలదించుకుంది కాంత చెప్పడం ఇష్టంలేనట్టు.

"పోన్లేమ్మా నీకిష్టం లేకపోతే చెప్పద్దు. నీ పేరు?"

"కాంత"

"ఈ ఊళ్ళో ఎవ్వరూ లేరామ్మా నీకు?"

తల అడ్డంగా ఊగించింది "నాకెవ్వరూ లేరు. అనాథని. నాదీ ఊరు కాదు"

"నాతో రామ్మా." ముందుకి నడిచారాయన.

"స్నేహితుడొకడికి వీడ్కోలు చెప్పడానికి స్టేషన్‌కొచ్చాను. ఈ పక్క సందులోనే నేనుండేది. నా పేరు వెంకటరమణమూర్తి." తన గురించి చెప్పుకున్నారాయన.

అనాథ శరణాలయం గురించి తను అడుగుతుంటే. ఆయన తన గురించి చెప్పుకుంటాడేమిటి? అయోమయంగా చూస్తూ ఆయన వెనకే నడుస్తోంది కాంత.

"తాతయ్యా! ఈ అక్క మనతో వస్తుంది కదూ"

"ఔను బాబూ"

వాళ్ళిద్దరి మాటలకి నవ్వాలో ఏడవాలో తెలియలేదు కాంతకి. తన అభిప్రాయం తెల్సుకోకుండానే అంత ఖచ్చితంగా ఎలా చెప్తున్నాడాయన? అనాథని చూస్తే అందరికీ లోకువే. ఏ ఉద్దేశంతో తనని వాళ్ళింటికి రమ్మంటున్నాడో, వెళ్ళాలా వద్దా? మనవడున్నాడు కాబట్టి ఇంట్లో కుటుంబం ఉన్న మనిషే, ఒంటరిగాడు కాదని తెలుస్తోంది. వెళ్ళడానికి భయపడనక్కర్లేదు. కానీ తన గురించిన వివరాలేమీ తెలియకపోయినా కూడా తన ఇంటికి రమ్మని ఎలా అనగలిగాడు? ఎందుకన్నాడు? ఇది కూడా ఒక రకం మోసమా? ఏం ప్లాను వేసుకున్నారో ఈ కాస్సేపట్లో.

"రామ్మా, ఇదే నేనుండే ఇల్లు". గేటు తీసి ఆయన లోపలికి అడుగుపెడుతుంటే ఒక్క క్షణం నిలబడిపోయి పరిశీలనగా చూసింది. ఇంట్లోంచి, ఎవరిదో తీయని స్వరం, సన్నగా భక్తిగీతం ఆలాపిస్తూ చెవుల్ని తాకింది. ఇది ఇల్లా? లేక ఏదైనా ఆశ్రమమా, సందేహం మొలకెత్తింది కాంత మనసులో.

వరండాలో ఉన్న కుర్చీలో కూర్చుంటూనే "అమ్మా మేరీ! మన ఇంటికి వచ్చిన కొత్త అతిథిని లోపలికి తీసికెళ్ళి, స్నానం, టిఫినూ వగైరా ఏర్పాట్లు చూడమ్మా" అని అతి మామూలుగా ఆయన చెబుతూ వుంటే అవాక్కయి నిలబడింది కాంత.

లోపల్నించి వినవస్తున్న భక్తి గీతం ఆగిపోయింది. అడుగుల

చప్పుడు దగ్గరైంది. పెదవులమీద చిరునవ్వుతో, సన్నగా చామనఛాయగా, పరికిణీ వోణీలో ఉన్న ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయి కాంత దగ్గరగా వచ్చి చేయి అందుకుంది.

"రా అక్కా నువ్వు నా కంటే చిన్నదానివో, పెద్దదానివో నాకు తెలియదు. అక్కా అని పిలిచేశాను మరేమనుకోకు. రా లోపలికి. ఈ ఇంట్లో నువ్వు భయపడవలసిన అవసరంలేదు". కలో, నిజమో అర్థం కాలేదు కాంతకి. ఎన్నో ప్రశ్నలు, ఎన్నెన్నో సందేహాలు, సమాధానం దొరకట్లేదు. సినిమాల్లో తప్ప నిజ జీవితాల్లో ఇటువంటి సంఘటనలు జరుగుతాయా అసలు? కానీ జరుగుతోందే...తన కళ్ళెదురుగానే తన జీవితంలోనే జరుగుతుంటే నమ్మకుండా ఎలా? అంతలోనే గుండెల్లో గుబులు ఇదో రకం మోసం కాదుకదా వీళ్ళది....లోపలికి వెళ్తే తన గతి అధో గతి అయిపోదు కదా! ఒక నరకంనించి మరో నరకంలోకి అడుగు పెట్టినట్టవదు కదా! గుమ్మం ఇవతల నిలబడే లోపలి హాల్లోకి తొంగి చూసింది ముందు. ఆ పెద్ద హాల్లో ఇటూ అటూ ఆరు కుట్టు మెషీన్లున్నాయి. సగం కుడుతూ కుడుతూ ఉన్న జాకెట్టు ఒక మెషీన్లో ఉంది. కుడివైపు చివరగా బ్లాక్ బోర్డు ఒకటి ఉంది. ఎడమవైపు గోడవారగా మూడు అద్దాల బీరువాల నిండా ఏవేవో పుస్తకాలున్నాయి. ఎదురుగా గోడకి ఉన్న షెల్ఫులో రకరకాల బొమ్మలు పూసల్తో చేసినవీ, గుడ్డతో చేసినవీ ఉన్నాయి. ప్లాస్టిక్ వైరుతో అల్లిన పూలసజ్జలూ, సంచులూ కూడా అందంగా అమర్చబడి ఉన్నాయి. హిందూ దేవుళ్ళవేకాక ఏసుక్రీస్తు, మేరీమాతల ఫోటోలు కూడా- వెలిగి ఆరే చిన్నిచిన్ని బల్బులతో అందంగా కన్నులకింపుగా ఉండడం చూసి ఒక్క క్షణం మూగబోయింది కాంత హృదయం. ఇది ఇల్లు కాదు.... దేవాలయమేమో అన్న భ్రాంతి కలిగింది. లోపల అడుగువెయ్యడానికి మరి తాత్సారం చెయ్యలేదు. మేరీ తిన్నగా వంటఇంట్లోకి తీసికెళ్ళి పీట వాల్చింది. వంటపనిలో మునిగి ఉన్న ఇద్దరు నడివయసు ఆడవాళ్ళు వెనక్కి తిరిగి కాంతవంక చూసి పలకరింపుగా నవ్వారు. అందులో ఒకావిడ, ఒక ప్లేటులో ఉప్మా పెట్టి 'తీసుకోమ్మా' అంటూ కాంత ముందు పెట్టింది....

"ఈవిడ లక్ష్మి ఆంటీ ఆవిడ సుభద్ర ఆంటీ....వీడు లక్ష్మి ఆంటీ కొడుకు. నా పేరు మేరీ" అంటూ పరిచయాలు పూర్తిచేసింది మేరీ.

ఇంతలో పెరటివైపునించి ఒక ఇరవయ్యేళ్ళమ్మాయి చేతిలో కడిగిన ప్లేట్లు, గ్లాసుల్తో లోపలికి వొచ్చింది.

"అన్నట్టు ఆమె పేరు లత". ఆ అమ్మాయిని చూపించింది మేరీ.

అప్రయత్నంగా కాంత పెదవులమీద సన్నని చిరునవ్వు విరిసింది "నా పేరు కాంత" తనని తను పరిచయం చేసుకుంది.

టిఫిను, స్నానం పూర్తయ్యాక వెంకటరమణమూర్తిగారు కూర్చున్న చోటికి వచ్చి, ఆయన పాదాలంటి నమస్కరించింది కాంత.

చటుక్కున లేవదీసి, వీపు మీద చెయ్యివేసి మృదువుగా తట్టారాయన. "నాకు కాదమ్మా. ఆ భగవంతుడికి నమస్కరిస్తే చాలు."

"నా గురించి మీతో కొంచెం చెప్పుకోవాలి." చిన్నగా గొణిగింది.

"నీకు చెప్పుకోవాలనిపిస్తే చెప్పు తల్లీ వింటాను." అదే మందహాసం ఆయన అధరాలమీద.

క్లుప్తంగా తన కథ ఆయనకి వినిపించింది.

"నా బ్రతుకు నాశనం చెయ్య తలపెట్టిన ఆ రాక్షసుడిని చావ బాది బయటపడ్డాను. నే చేసింది తప్పంటారా బాబుగారూ? ఇంక అంతకంటె నాకు గత్యంతరం లేకపోయింది"

"ఆ భగవంతుడు నిన్ను చల్లగా చూడాలి. చల్లగా చూస్తాడు. నిర్మలమైన మనసుతో ఆ భగవంతుడిని ప్రార్థించుకో. వెళ్ళి విశ్రాంతి తీసుకోమ్మా."

ఆయనతో తన మనసు విప్పి చెప్పుకోగానే ఎంతో భారం దింపుకున్నట్టుగా అనుభూతి పొందింది కాంత. లేచి మేరీ గదిలోకి వెళ్ళింది.

"మేరీ నా సందేహాలు ఒక్కొక్కటి తీరుస్తావా?"

"తప్పకుండా"

"మేరీ, ఆయన చెప్పగానే "రా అక్కా" అంటూ నన్ను లోపలికి తీసుకుపోయావేగానీ ఈ అమ్మాయి ఎవరూ? ఏమిటి? అని ఏదీ అడగలేదే ఆయన్ని? ఆయన నీకేమవుతారు?"

మేరీ కళ్ళు జాలిగా నవ్వాయి. "ఎందుకూ అడగడం? నేనూ ఒకప్పుడు ఈ ఇంట్లో నీకుమల్లే అడుగుపెట్టినదాన్నేగా?"

"అంటే?"

"దైవం చేతగానీ, తోటి మనిషి చేతగానీ వంచింపబడ్డ వాళ్ళకి ఈ ఇల్లు ఆశ్రయమిస్తుంది. ఆయన నీకేమవుతారో నాకూ అదే అవుతారు."

"తోటి మనిషిచేత వంచింపబడటం అన్నావు బాగుంది. కానీ దైవంచేత అంటావేమిటి?"

"సుభద్ర ఆంటీ దైవంచేత వంచింపబడిందనే అంటాన్నేను. కట్టుకున్న భర్తని, కన్న కొడుకుని ఒకేసారి రైలు ప్రమాదంలో పోగొట్టుకున్న అభాగ్యురాలు. మనిషి బంగారం. మనసు వెన్నపూస. ఆ దేవుడు ఆవిడకి అన్యాయం చేశాడు పాపం అని అనిపించదూ ఎవరికైనా."

"ఔను. నిజం చెప్పావు. వెంకటరమణమూర్తిగారు పెళ్ళి చేసుకోలేదా? ఆయనకి తన కుటుంబమంటూ లేదా?"

"ఆయన పెళ్ళి చేసుకున్నారు. లేక లేక ఆయనకి కలిగిన సంతానం ఒక కొడుకు. కొడుకంటే పంచప్రాణాలు ఆయనకి. పిల్లాడికి ఏడేళ్ళ వయసులోనే ఆయన భార్య పోయింది. ఆ పిల్లాడిని పువ్వుల్లో పెట్టి చూసుకుంటూ వాడికోసమే మళ్ళీ పెళ్ళి అన్న మాట తలపెట్టకుండా కంటికి రెప్పలా పెంచుకొచ్చారు. డబ్బుకి, సంఘంలో పరపతికి కొదవ లేదు. కొడుకు మీద ఆయన పెట్టుకున్న ఆశలన్నీ ఒక్కొక్కటీ నేల కూలుతుంటే ఆయన గుండె ముక్కలైంది. పెద్ద పెద్ద చదువులు కొడుకు చదవాలన్న ఆయన ఆశ నిరాశే అయింది. వాడికి చదువే ఒంటపట్టలేదు. ఎంతసేపూ చెడు స్నేహాలే. చెడు అలవాట్లకి బానిస అయ్యాడు. విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెట్టడం, తాగడం, పేకాడటం, తన కంటికి నచ్చిన ఆడపిల్లనల్లా మాయమాటల్తో మభ్యపెట్టి, ప్రేమించానని పెళ్ళి చేసుకుంటానని నమ్మించి లొంగదీసుకుని తన కోరిక, మోజు తీరగానే నువ్వెవరో నాకు తెలియదు పొమ్మనడం ఇలా ఉండేవిట వేషాలు.

ఒక రోజు ఒకమ్మాయి వొచ్చి ఈయన కాళ్ళ మీద పడి మొరపెట్టుకుందిట. తన పేరు సుశీల అని, తనని పెళ్ళి చేసుకుంటానని వాగ్దానం చేశాడని, ఇప్పుడు తను తల్లి కాబోతున్నాననీ, ఎలాగైనా సరే అతన్ని ఒప్పించమనీ ఏడ్చి మొత్తుకుందిట. ఆ అమ్మాయిని తన కోడలిగా చేసుకుందుకాయన అభ్యంతరం చెప్పలేదు. నువ్వెవరు? నీదే కులం? ఏ గోత్రం? అంటూ ఆయన అర్థం లేని ప్రశ్నలు వెయ్యలేదు. ఆయనకి కులాల్తో, మతాల్తో సంబంధం లేదు. మనిషి ముఖ్యం.

కులం, గోత్రం చూసి తిరిగాడా తన కొడుకు ఆ పిల్లతో. తల్లి కాబోతోంది ఇప్పుడు. తిరగడానికి అడ్డురాని కులం, గోత్రం పెళ్ళి చేసుకునేటప్పుడు మాత్రం ఎందుకు? కానీ, కొడుకు ఆయన మాటని కాదన్నాడు. పెళ్ళి చేసుకునే ఆలోచనే తనకి లేదుట. అందినంతమటుకు జీవితం వెరైటీగా అనుభవించకుండా అప్పుడే పెళ్ళేమిటన్నాట్ట. అయితే ఈ లెక్కని నేను చాలామంది మెళ్ళో తాళి కట్టాల్సి ఉంటుంది అంటూ పగలబడి నవ్వాడుట.

దాంతో ఆయన మనసు వికలమైపోయి 'నువ్వు ఈ అమ్మాయిని పెళ్ళాడి, చెడు అలవాట్లన్నీ మానుకుని, సక్రమమైన మార్గంలో నడుచుకునేటట్టయితేనే ఈ ఇంట్లో ఉండు. లేకపోతే నీకీ ఇంట్లో చోటు లేదు. నా ఆస్తిలో ఒక్క పైసా కూడా నీకివ్వను' అని నిక్కచ్చిగా చెప్పేశార్ట. 'నువ్వు ఇవ్వకపోతే ఇంక నాకు డబ్బు సంపాదించే మార్గాలే తెలియవనుకున్నావా? నేను బతకలేననుకున్నావా' అంటూ ఇంట్లోంచి ఆ రోజు వెళ్ళిపోయినవాడు మళ్ళీ ఇంతవరకూ జాడలేడుట. అది మొదలు వెంకటరమణమూర్తిగారు పూర్తిగా మారిపోయారు. ఈ కథంతా నాకింత వివరంగా ఎలా తెలుసా అని నీ సందేహం కదూ. ఎన్నో ఏళ్ళుగా ఈ ఇంటిని అంటిపెట్టుకుని, మూర్తిగారికి నమ్మినబంటుగా ఉంటున్న నౌకరు వెంకన్న చెప్పాడు. కొడుకు ఇల్లు వదిలి వెళ్ళి పోయాక మూర్తిగారు తన డబ్బు సుశీల ఆంటీ, లక్ష్మి ఆంటీ, సుభద్ర ఆంటీలాటి వాళ్ళ మీద, నీబోటి నాబోటి వాళ్ళ మీద ఖర్చు పెడుతూ, అబలలకి ఆశ్రయమిస్తూ ఎప్పటికైనా తన కొడుకు మనసు మార్చుకుని మంచివాడుగా ఇంటికి తిరిగి రావాలని రోజూ ప్రార్థన చేస్తూ కాలం గడుపుకొస్తున్నారు. రోజూ మేమంతా ఆయనతో కల్సి పొద్దున్న ఒక అరగంటసేపు, రాత్రి పడుకోబోయే ముందు ఒక అరగంట సేపు పూజ గదిలో ప్రార్థనలు చేస్తాం. భక్తి గీతాలు అందరు దేవుళ్ళ మీదా పాడతాం. చివర్లో, మామూలు పూజ అంతా అయినాక, ఆయన కొడుకు మంచివాడుగా మారి తిరిగి రావాలని మనస్ఫూర్తిగా మా మనసుల్లో ప్రార్థిస్తాం."

"ఇకనించీ మీతోపాటు నేనూ ఆయన కొడుకు తిరిగి రావాలని ప్రతిరోజూ ఆ భగవంతుడిని వేడుకుంటాను" మనస్ఫూర్తిగా అంది శాంత.

"ఇక్కడ తన ఆశ్రయంలో ఉన్నవాళ్ళకి ఎవరికెందులో కుతూహలం ఉంటే ఆ విద్య చెప్పిస్తారు మూర్తిగారు. సుశీల కథంతా తెల్సి, తను చేసుకుంటానని మనస్ఫూర్తిగా ముందడుగు వేసిన ఒక అనాథ యువకుడికి తనకి తెల్సిన కంపెనీలో మంచి ఉద్యోగం వేయించి, ఆ ఇద్దరికీ పెళ్ళిచేసి పంపించారాయన. నాక్కూడా పెళ్ళి కుదరబోతోంది మూర్తిగారి దయవల్ల" చెంపలు ఎరుపెక్కగా, కనురెప్పలు బరువుగా వాల్చేసింది మేరీ.

"చాలా సంతోషం. మూడు పువ్వులూ ఆరుకాయలూగా నీ జీవితం చల్లగా వర్థిల్లాలి" మేరీ భుజమ్మీద చెయ్యివేసి మృదువుగా నొక్కింది శాంత.

రాత్రి పడుకోబోయేముందు అందరూ పూజ గదివైపు దారితీశారు.

"అడుగో అతనే వెంకన్న...మూర్తిగారికి నమ్మినబంటు చూశావా మంచితనంలో యజమానికి తీసిపోడు ఎప్పుడైనా మరీ ఉండబట్ట లేనప్పుడు అతనితో తన మనసు విప్పి చెప్పుకుంటూ ఉంటారు మూర్తిగారు. ఆవేదనతో ఆయన గుండె బద్దలవుతున్నప్పుడు వెంకన్నతో అంటారుట—

"నేను పోయేలోపల ఒక్కసారంటే ఒక్కసారి నా కొడుకు కనపడి నన్ను మనసారా 'నాన్నా' అని పిలుస్తాడంటావా? ఆ పిలుపు ఒక్కసారైనా నా చెవులారా వినగలనంటావా" అని మెల్లిగా శాంతకి మటుకు వినిపించేలా చెప్పింది మేరీ. శాంత మనసు ద్రవించింది. ఇంత మంచి మనిషికి ఆ భగవంతుడెలాంటి శిక్ష విధించాడు. ఆయన కోరిక తప్పక తీరాలి. తను కూడా రోజూ, తప్పకుండా ఆయన కోరిక తీర్చు భగవంతుడా అని ప్రార్థించాలి. పూజగదిలో అడుగుపెట్టి పరిశీలనగా ఆ గదిని చూస్తున్న శాంత కొయ్యబారిపోయింది. ఆ గదిలో ఒక మూలగా చిన్న టీపాయ్‌మీద అందమైన ఫ్రేములో బిగించబడి ఉన్న ఆ ఫోటోమీదే కళ్ళు నిల్చి పోయాయి.

"మూర్తిగారి కొడుకుది అ ఫోటో" చెప్పింది మేరీ.

"అది....అది" నోట్లోంచి మాట పూర్తిగా బయటికి రాలేదు శాంతకి.

"ఏవిటి శాంతా ఏమైంది? అలా అయిపోయావేమిటి?"

మేరీ చేతుల్లో వెనక్కి వాలిపోయింది శాంత.

నెమ్మదిగా కళ్ళువిప్పింది శాంత. ఎక్కడుంది తను? అరే! ఈ మంచమ్మీద కెలా వొచ్చింది?

"మంచినీళ్ళేమైనా కావాలా తల్లీ?"

ఉలిక్కిపడి తిరిగి చూసింది. మూర్తిగారు. కొంచెంసేపటి క్రితం జరిగినది గుర్తుకొచ్చింది....పూజగదిలో ఫోటో గుర్తుకొచ్చింది. రెండు చేతుల్తో ముఖం కప్పుకుంది. దుఃఖం తన్నుకొస్తుంటే ఆపుకోలేకపోయింది.

"తప్పమ్మా, ఏడవకు...."

"మీకు తెలియదు బాబుగారూ మీకు తెలియదు...."

"నా కంతా అర్థమైంది...."

చటుక్కున మొహమ్మీంచి చేతులుతీసి భయం భయంగా ఆయన మొహంలోకి చూసింది. అయిపోయింది. ఇంక తనకీ దేవాలయంలో స్థానం ఉండదు....తన నిక్కడినించి వెళ్ళిపొమ్మంటారు.

"పూజగదిలో అడుగుపెడుతూనే నీ కళ్ళు ఆ ఫోటోమీద నిల్చి పోవడం నేను గమనించాను తల్లీ....వెంటనే నువ్వు స్పృహ తప్పి పడిపోతే నా కంతా అర్థమైంది తల్లీ....అర్థమైంది" ఆయన గొంతు జీరపోయింది.

'మూర్తిగారి ఆఖరి కోరిక తీరడానికి తనే అడ్డు అయిపోయింది. ఎంత పాపిష్టిది తను....ఇంక రోజూ తన మొహం చూస్తూ ఆయనెలా భరించగలరు? వెళ్ళిపొమ్మంటారు తననీ ఇంట్లోంచి....ఔను' గబుక్కుని లేచింది.

"లేవకు తల్లీ. పడుకో....నీ కిప్పుడు విశ్రాంతి చాలా అవసరం".

"బాబుగారూ" శాంత పెదవులు వణికాయి.

"పిచ్చితల్లీ....నిశ్చింతగా ఉండు. ఆ భగవంతుడు నిన్ను చల్లగా చూడాలి" తన చేతిని దీవిస్తున్నట్టు శాంత శిరసుమీద ఉంచారు. బయటనించి కీచురాళ్ళ రొద అంతకంతకీ ఎక్కువవుతోంది. శాంత కళ్ళల్లో ఆనందబాష్పాలు నిలిచాయి....ఇంక తను జీవితంలో ధైర్యంగా ముందుకి సాగిపోతుంది....ఏ కీచురాళ్ళ రొదకీ తనింక భయపడదు....ఏ రకం కష్టానికి కుంగిపోదు. బాబుగారి చల్లని దీవెనలు తనకుండగా తన కెందుకింక భయం...! ◆